

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చీకటాయపాలెంలో యాకమ్మ ప్రశ్నిస్తుండగా సమాధానం చెప్పకుండా కారు ఎక్కి వెళ్లిపోతున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

## ఎమ్మెల్యే యశస్వినీరెడ్డిని నిలదీసిన ప్రజలు

- **ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో అవకతవకలపై ప్రజల ఆగ్రహం**

తొర్రూరు, జూన్ 20 : మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డికి ప్రజల నుంచి మరోసారి నిరసనసెగ తగిలింది. ప్రతిచోటా స్థానికులు నిలదీశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులకే కేటాయించారని ఆరోపించారు. చీకటాయపాలెంలో కాంగ్రెస్ జెండా ఆవిష్కరణకు యశస్వినీరెడ్డి హాజరయ్యారు. అంతకుముందే జెండా కర్ర నేలపై పడిపోయింది.

## మీ ఇందిరమ్మ ఇల్లు నాకొద్దు

- **ప్రభుత్వ సాయాన్ని నిరాకరించిన తెలంగాణ ఉద్యమకారుడు**



సోన్, జూన్ 20 : కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటిని తెలంగాణ ఉద్యమకారుడు తిరస్కరించాడు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సబ్సిడీతో కూడిన ఆర్థిక సాయాన్ని మంజూరు చేస్తూ నిర్మల్ జిల్లా సోన్ మండలం మాదాపూర్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు సామ కిరణ్‌రెడ్డికి కలెక్టర్ పత్రాలు అందజేశారు. అయితే ఈ ఆర్థిక సాయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శికి లేఖ రాశారు. ఉద్యమకారుల ఆకాంక్షలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.



భద్రాద్రి జిల్లా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కారు ఎదుట బైఠాయించిన సారపాక వాసులు

## పినపాక ఎమ్మెల్యేకు నిరసన సెగ

- **కారు ఎదుట సారపాక వాసుల ధర్నా**
- **తాగునీరు అందించాలని డిమాండ్**

బూర్గంపహాడ్, జూన్ 20 : తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాక గ్రామస్థులు శుక్రవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కారు ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. తాళ్లగొమ్మూరు నుంచి వస్తుండగా సారపాక గ్రామస్థులు ఆయన కారు ఎదుట బైఠాయించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చామని, ఈవోకు సైతం సమస్యను వివరించినా పరిష్కారం కాలేదని ఆరోపించారు. ఎమ్మెల్యే హామీతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

## లోకం పోకడ




సారు 'హలో' అనడం మానేశాడు!

## గీత దాటితే చర్యలు తప్పవు

- **విలేకర్ల సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్**



హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): మంత్రులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు గీతదాటితే చర్యలు తప్పవని, పార్టీ నిబంధనలు ఉల్లంఘించి మాట్లాడితే సహించేది లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఒకరి శాఖల్లో మరొకరు జోక్యం చేసుకోవద్దని రాష్ట్ర మంత్రులకు తేల్చిచెప్పారు. స్థానిక ఎన్నికలపై మాట్లాడటం సరికాదని మంత్రి పొంగులేటికి స్పష్టం చేయడంతో.. కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకే అలా మాట్లాడినట్టు ఆయన వివరణ ఇచ్చారని వెల్లడించారు.

**జూబ్లీహిల్స్‌లో అభ్యర్థి నిలబెడతాం..**

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం వల్ల జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి జరిగే ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని నిలబెడతామని మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌లో నిలబడే కాంగ్రెస్ అభ్యర్థిని తానేనని మాజీ క్రికెటర్, మాజీ ఎంపీ అజారుద్దీన్ ప్రకటించుకోవడంలో తప్పేమీ లేదని తెలిపారు. ఆ సీటు అభ్యర్థిగా ఎవరు ప్రకటించుకున్నప్పటికీ అది వారి వ్యక్తిగతమేనని, పద్ధతి ప్రకారం దరఖాస్తుల స్వీకరణ తర్వాత కాంగ్రెస్ అధిష్ఠానమే అభ్యర్థిని ఎంపిక చేస్తుందని స్పష్టత ఇచ్చారు.

**డీసీసీ నివేదిక తర్వాత చర్యలు**

వరంగల్ కాంగ్రెస్‌లో నెలకొన్న పరిస్థితులపై పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని పరిశీలకులకు సూచించినట్టు చెప్పారు. ఆ రిపోర్టు ఆధారంగా డీసీసీ నివేదిక ఇస్తుందని, దాని ఆధారంగా క్రమశిక్షణ చర్యలు చేపడతామని తెలిపారు.

## కడియం శ్రీహరి నల్లికుట్లోడు!

- **మంత్రి కొండా సురేఖ**



వరంగల్, జూన్ 20 : స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆమె మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఎమ్మెల్యే కడియంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'కడియం శ్రీహరి నలికుట్ల మనిషి.. నేను మంత్రిగా ఉంటే తట్టుకోలేకపోతున్నడు. నా ముందు కూర్చోడానికి నామోషీగా ఫీల్ అవుతున్నడు. అందుకే నా మంత్రి పదవి పోతుందని తప్పుడు ప్రచారం చేయిస్తున్నడు' అని ఆరోపించారు. తరచూ సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వద్దకు వెళ్లి తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నాడని చెప్పారు. 'నాకు అదృష్టం ఉన్నది.. మంత్రి అయిన. ఆయనకు అదృష్టం ఉన్నప్పుడు ఆయన మంత్రి అయ్యిండు. మాటిమాటికి నేను దిగిపోవాలని మాట్లాడుడు మంచిది కాదు. నా కూతురుకు అదృష్టం లేదు.. ఎమ్మెల్యే కాలేదు. కడియం కూతురుకు అదృష్టం ఉన్నది ఎంపీ అయింది' అని హాట్ హాట్ కామెంట్లు చేశారు.

# ధాన్యం బిడ్డర్లు ఎవరిమాటా వినరు!

### వేలకోట్ల నష్టం వచ్చినా ఈగవాలనివ్వని సర్కారు

వేలం ధాన్యం ఎత్తేందుకు బిడ్డర్లు ససేమిరా

ఏడాదిన్నరగా మూలుగుతున్న వైనం

ఐదు సార్లు బిడ్ల గడువు పొడిగింపు

వారంక్రితమే ముగిసిన ఆఖరి గడువు

- 38 లక్షల టన్నుల్లో సగం ఎత్తనేలేదు
- రాష్ట్ర హైకోర్టు ఆదేశాలూ బేఖాతర్
- ధాన్యమొద్దు.. పైసలివ్వాలని మిల్లర్లపై ఒత్తిడి
- బిడ్డర్ల నిర్లక్ష్యంతో సివిల్‌సప్లై శాఖకు తీవ్రనష్టం
- అసలు రూ.3,800 కోట్లు, వడ్డీ మరో రూ.వెయ్యి కోట్ల వరకు నష్టం
- చేష్టలుడిగి చూస్తున్న సివిల్‌సప్లై, సర్కార్
- ఇప్పటికీ బిడ్డర్లపై కనీస చర్యలకు వెనుకడుగు
- బిడ్డర్లకు 'ఉత్తమ' పెద్దలు, వ్యూహకర్తలే అండ



హైదరాబాద్, జూన్ 20(నమస్తే తెలంగాణ): 'ఉత్తమ' అధికారుల అండదండలు ఉంటే ఏదైనా సాధ్యమేననే విషయం ధాన్యం వేలం ప్రక్రియలో నిరూపితమైంది. గడువులోగా ధాన్యం ఎత్తకపోయినా వారిపై చర్యలు ఉండనే ఉండవు.. ఎన్నిసార్లు కోరితే అన్నిసార్లు అడగడమే ఆలస్యమనేలా గడువుపై గడువు పొడిగిస్తారు. సర్కారుకు వేల కోట్ల నష్టమొచ్చినా సరే.. సదరు బిడ్డర్లపై మాత్రం ఈగ వాలనివ్వడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఇచ్చిన గడువు సైతం 10 రోజుల క్రితం ముగిసింది. అయినా లక్షలాది టన్నుల ధాన్యం మిల్లుల్లోనే మూలుగుతున్నది. ధాన్యం ఎత్తడానికి సంబంధించి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు సైతం బేఖాతరు చేయడం గమనార్హం. 2022-23 యాసంగికి సంబంధించిన 38 లక్షల టన్నుల ధాన్యాన్ని కాంగ్రెస్ సర్కారు గ్లోబల్ టెండర్ల ద్వారా విక్రయించింది. ఇందుకు సంబంధించి 2024 ఫిబ్రవరి 23న ధాన్యం దక్కించుకున్న బిడ్డర్లకు అధికారికంగా తెలిపింది. ధాన్యం ఎత్తేందుకు 90 రోజుల గడువు ఇచ్చింది. అంటే 2024 మే 23వ తేదీతో ఆ గడువు కూడా ముగిసింది. కానీ బిడ్డర్లు 3 లక్షల టన్నులకు మించి ధాన్యం ఎత్తలేదు. ఈ గడువును మరో నాలుగు నెలలు అంటే 2024 సెప్టెంబర్ 30 వరకు పొడిగించింది. అయినా బిడ్డర్లు ధాన్యం ఎత్తలేదు. దీంతో మూడోసారి మరో మూడు నెలలు అంటే 2024 డిసెంబర్ 31 వరకు గడువు పొడిగించింది.

**38 లక్షల్లో ఎత్తింది 19 లక్షల టన్నులే..**

వేలం ధాన్యం ఎత్తేందుకు ప్రభుత్వం బిడ్డర్లకు 16 నెలల గడువు ఇచ్చింది. అయినా బిడ్డర్లు 50 శాతం ధాన్యం కూడా ఎత్తకపోవడం గమనార్హం. మొత్తం 38 లక్షల టన్నుల ధాన్యంలో ఇప్పటివరకు 18.97 లక్షల టన్నులు మాత్రమే ఎత్తినట్టు తెలిసింది. అంటే ఇంకా 19.03 లక్షల టన్నుల ధాన్యం మిల్లుల్లోనే మూలుగుతుండటం గమనార్హం. 16 నెలల్లో బిడ్డర్లు ఎత్తింది కేవలం 49.92 శాతం ధాన్యం మాత్రమే.

**అసలు, వడ్డీ సహా వేల కోట్లల్లో నష్టం**

వేలంలో క్వింటా ధాన్యం ధర సగటున రూ.2 వేలు పలికింది. ఈ లెక్కన 38 లక్షల టన్నుల ధాన్యం విలువ రూ.7,600 కోట్ల వరకు ఉంటుంది. ఈ ధాన్యాన్ని ప్రభుత్వం అంతకుముందు బ్యాంకుల నుంచి సుమారు 12 శాతం వడ్డీతో రుణాలు తీసుకొచ్చి రైతుల నుంచి సేకరించింది. వేలం ద్వారా ధాన్యం విక్రయించి ఆ రుణాన్ని చెల్లించాలి. కానీ వేలం ద్వారా ధాన్యం దక్కించుకున్న బిడ్డర్లు ధాన్యం ఎత్తకపోవడం, నగదు చెల్లించకపోవడంతో పౌరసరఫరాల సంస్థ తీసుకొచ్చిన రుణం అలాగే ఉండిపోయింది. ప్రతినెలా రూ.90 కోట్ల వరకు వడ్డీ చెల్లిస్తున్నట్టుగా తెలిసింది.

**ధాన్యం వద్దు.. నగదు ఇవ్వండి!**

వేలంలో ధాన్యం దక్కించుకున్న మిల్లర్లు ధాన్యం ఎత్తేందుకు ససేమిరా అంటున్నట్టుగా మిల్లర్లు ఆరోపిస్తున్నారు. ధాన్యానికి బదులు నగదు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్టు ఆరోపిస్తున్నారు. 'మేం రూ.2 వేలకు ధర వేసినం. ఇతర ఖర్చులు కలిపి క్వింటాకు రూ.2300 చొప్పున ఇవ్వండి' అంటూ మిల్లర్లకు అల్టిమేటం జారీ చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇందులో భాగంగానే మిల్లర్లపై పలువురు పెద్దలు కూడా ఒత్తిడి పెంచినట్టు తెలిసింది.

**ఉత్తమ పెద్దలు, వ్యూహకర్తల అండతోనే!**

బిడ్డర్ల వెనుక పెద్దలు ఉన్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. 'ఉత్తమ పెద్దలతో'పాటు ఓ 'వ్యూహకర్త' పాత్రపై గుసగుసలు వినిపిస్తున్నాయి. సదరు వ్యూహకర్త ధాన్యం 'కొనుగోలు' వ్యవహారాన్ని చక్కదిద్దినట్టు విశ్వసనీయంగా తెలిసింది. బిడ్డర్లకు, ఢిల్లీకి మధ్య అన్ని వ్యవహారాలను చక్కదిద్దినట్టు తెలిసింది. అందుకే వాళ్లు ఆడిందే ఆట, పాడిందే పాటలా సాగుతున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ధాన్యం వేలానికి సంబంధించి ఇప్పటికే పెద్ద మొత్తంలో ఢిల్లీకి ముడుపులు ముట్టాయంటూ బీఆర్‌ఎస్ నేతలు ఆరోపణలు చేశారు. బిడ్డర్లపై ప్రభుత్వ ఉదాసీనత, పలుమార్లు గడువు పెంపు, ధాన్యం ఎత్తకపోయినా వారిపై చర్యలు తీసుకోకపోవడంతో ఆరోపణలకు బలం చేకూరుతున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## వానా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| మెదక్ | 40.0°c | 25.2°c |
| ఆదిలాబాద్ | 37.5°c | 23.1°c |
| ఖమ్మం | 36.0°c | 27.0°c |
| వరంగల్ | 36.0°c | 25.0°c |
| నల్లగొండ | 35.5°c | 24.0°c |
| హైదరాబాద్ | 34.7°c | 24.6°c |
| రంగారెడ్డి | 34.5°c | 22.8°c |
| కరీంనగర్ | 34.0°c | 27.0°c |
| నిజామాబాద్ | 33.5°c | 24.6°c |
| మహబూబ్‌నగర్ | 31.0°c | 23.0°c |

## బలపడుతున్న రుతుపవనాలు

**వచ్చే నాలుగు రోజులు రాష్ట్రంలో వర్షాలు**

**వాతావరణ శాఖ అంచనా**

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): రుతుపవనాలు బలపడుతుండటంతో రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా ఉరుములు, ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉందని హెచ్చరించింది. తెలంగాణ, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో వర్షం కురిసే సమయంలో గంటకు 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వెల్లడించింది. తెలంగాణతో పాటు కోస్తాంధ్ర, రాయలసీమలో మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. బంగాళాఖాతంలోని ఆవర్తన ప్రభావంతో తెలంగాణలో పశ్చిమ, నైరుతి దిశల నుంచి గాలులు వీస్తున్నాయని, వీటి ప్రభావంతో శుక్రవారం అక్కడక్కడ ఉరుములు మెరుపులతో తేలికపాటి వర్షాలు కురిశాయని వాతావరణ శాఖ తెలిపింది. శనివారం కూడా ఆదిలాబాద్, కుమ్రంభీం-ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న-సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్-భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు పడవచ్చని అంచనా వేసింది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది.

**గడిచిన 24 గంటల్లో ..**

గడిచిన 24 గంటల్లో నిర్మల్ జిల్లా నిర్మల్ మండల కేంద్రంలో అత్యధికంగా 2.82 సెం.మీ వర్షపాతం నమోదైంది. నిర్మల్ రూరల్‌లో 1.93 సెం.మీ, సారంగపూర్‌లో 1.02 సెం.మీ, ఆదిలాబాద్ జిల్లా సత్నాలలో 1.33 సెం.మీ, ఇచ్చోడలో 1.02 సెం.మీ, నిజామాబాద్ జిల్లా నవీపేటలో 1.32 సెం.మీ, మెండోరాలో 1.01 సెం.మీ, నిజామాబాద్ సౌత్‌లో 0.98 మి.మి చొప్పున వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది.

**వాడుబడుతున్న మొలకలు**

ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు పదిరోజుల ముందే ప్రవేశించినప్పటికీ, ఆరంభంలోనే భారీ వర్షాలు కురుస్తాయని ఆశపడ్డ రైతులకు నిరాశే ఎదురైంది. మే నెల చివర్లోనే కొన్ని జిల్లాల్లో వర్షం కురవడంతో జూన్ మొదటి వారంలోనే పొలాల్లో విత్తనాలు వేసేందుకు ముందుకొచ్చారు. కానీ, ఆ తర్వాత వర్షాలు కనుమరుగయ్యాయి. వానలు పడకపోవడంతో పొలాల్లో మొలకెత్తిన విత్తనాలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

# ఓరుగల్లు కాంగ్రెస్‌లో గ్రూప్ వార్

- **కొండా వ్యాఖ్యలతో మరింత దుమారం**
- **నాయిని రాజేందర్‌రెడ్డి ఇంట్లో వరంగల్ జిల్లా ఎమ్మెల్యేల భేటీ ఉమ్మడి**
- **పీసీసీ చీఫ్‌కు ఫిర్యాదులు**

వరంగల్, జూన్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఓరుగల్లు కాంగ్రెస్‌లో గ్రూపుల లొల్లి ముదురుతున్నది. వరంగల్ ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు వర్గాలుగా ఏర్పడి ఆధిపత్య పోరుకు దిగడం స్థానికంగా చర్చనీయాంశమైంది. మొదట్లో అంతర్గతంగా ఉన్న గ్రూపు రాజకీయాలు ఏడాది క్రితమే బహిర్గతమయ్యాయి. సమ్మక్క-సారలమ్మ జాతర, ధార్మిక భవన్, పోలీసు పోస్టింగులు, మాజీ రౌడీషీటర్‌కు ప్రాధాన్యం, నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశాల్లో మంత్రి సురేఖకు, మెజారిటీ ఎమ్మెల్యేలకు మధ్య విభేదాలు తీవ్రమయ్యాయి. తాజాగా మంత్రి కొండా సురేఖ భర్త మురళీధర్‌రావు.. గురువారం చేసిన వ్యాఖ్యలు మరింత కాకరేపాయి. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య లక్ష్యంగా ఆయన వ్యాఖ్యలు దుమారం రేపాయి. దీంతో హనుమకొండలోని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఇంట్లో ఎమ్మెల్యేలు కడియం, రేవూరి, గండ్ర సత్యనారాయణరావు, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మంత్రి వ్యవహారశైలి, మురళీధర్‌రావు



ప్రత్యేకంగా సమావేశమైన ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, కేఆర్‌నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పీసీసీ చీఫ్‌కు ఫిర్యాదు**

కొండా మురళీధర్‌రావు వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు కడియం శ్రీహరి, బస్వరాజు సారయ్య ఫిర్యాదు చేశారు. సురేఖ, మురళి వ్యవహారశైలిపై మిగిలిన ఎమ్మెల్యేలు ఇప్పటికే వీడియోలు, ఫొటోలను పీసీసీ చీఫ్‌కు పంపించారు. మహేశ్‌కుమార్‌గౌడ్‌ను రెండుమూడు రోజుల్లో స్వయంగా కలిసి మరోసారి ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. ఉమ్మడి వరంగల్‌కు చెందిన 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఎక్కువ సెగ్మెంట్లలో కొండా దంపతులు జోక్యం చేసుకొని గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని గత అక్టోబర్‌లోనూ పలువురు ఎమ్మెల్యేలు అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. సమన్వయం పాటించాలని రెండు వర్గాలకు అప్పట్లో అధిష్ఠానం సూచించినా ఆ ప్రభావం ఏమీ లేకుండాపోయింది.

**తొలినుంచీ గ్రూపులే**

కాంగ్రెస్ సర్కారు ఏర్పడినప్పటి నుంచే ఓరుగల్లులో గ్రూపు రాజకీయాలు మొదలయ్యాయి. ఉమ్మడి వరంగల్ నుంచి కొండా సురేఖ, సీతక్క మంత్రులుగా ఉన్నారు. మొదట్లో వీరిద్దరి నేతృత్వంలో రెండు గ్రూపులు ఏర్పడ్డాయి. టీడీపీ నుంచి కాంగ్రెస్‌లో చేరి గెలిచిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రూనాయక్ మొదటి నుంచి మంత్రి సీతక్కతో ఉంటూ వస్తున్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, భూక్యా మురళీనాయక్ మంత్రి కొండా సురేఖ వెంట ఉన్నారు. తొలినుంచీ కాంగ్రెస్‌లో ఉన్న నర్సంపేట ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి రెండు గ్రూపులకు దూరంగా ఉంటూ వచ్చారు.

**సమ్మక్క జాతర నుంచే తీవ్రం**

2024లో మేడారం జాతరకు ముందు మంత్రులు సురేఖ, సీతక్కకు మధ్య విభేదాలు తీవ్రమయ్యాయి. జాతర ప్రదేశం సీతక్క నియోజకవర్గమైన ములుగులో ఉన్నది. జాతర నిర్వహించే దేవాదాయ శాఖ మంత్రిగా కొండా సురేఖ ఉన్నారు. జాతర అభివృద్ధి పనులు, ఏర్పాట్లపై ఇద్దరు మంత్రుల మధ్య దూరం పెరిగింది. ఆ తర్వాత దేవాదాయ శాఖ పరిధిలోని వరంగల్ ధార్మిక భవన్‌లో మేడారం జాతర ఈవో ఆఫీసు కేటాయింపు వ్యవహారం విభేదాలకు మరింత ఆజ్యం పోసింది. ఇక పలు నియోజకవర్గాల్లో మంత్రి సురేఖ జోక్యం చేసుకోవడం ఎమ్మెల్యేల ఆగ్రహానికి కారణమైంది. బీసీ కార్డునే అడ్డంపెట్టుకొని ఇతర ప్రజాప్రతినిధులపై ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆ పార్టీ నాయకుడు కొండా మురళీధర్‌రావును హెచ్చరించారు. ఏ సమస్య ఉన్నా పార్టీలో అంతర్గతంగా చర్చించాలని, ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేది లేదని చెప్పారు. పార్టీలో ఆధిపత్య పోరుతపై పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ స్పందించారు. రెండు వర్గాల నుంచి ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. పార్టీ పరిశీలకుల నివేదిక మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# వరంగల్‌లో 'సలహాదారు' చెప్పిందే ఫైనల్

**ఆయన నేతృత్వంలోనే సైకిల్ కాంగ్రెస్ నేతలు • చెప్పినవారికే పోస్టింగ్స్.. పదవులు • కక్కలేక మింగలేక పాత కాంగ్రెస్ నేతలు**


హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ) : వరంగల్ ఉమ్మడి జిల్లాలో అసలు కాంగ్రెస్, సైకిల్ కాంగ్రెస్ నేతల మధ్య వైరం రచ్చకెక్కుతున్నది. తొలినుంచీ కాంగ్రెస్ భావజాలంతో పనిచేస్తున్న నేతలకు, టీడీపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన నేతలకు మధ్య అస్సలు పొసగడం లేదు. వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి పేరుకు ఇద్దరు మంత్రులున్నా.. ఓ సలహాదారే చక్రం తిప్పుతున్నాడని తెలుస్తున్నది. ఆ సలహాదారే మూడో మంత్రిగా కూడా చలాయిస్తున్నారని కాంగ్రెస్ నేతలే చెప్తున్నారు. ఏ ముఖ్యమైన పనికావాలన్నా ఈ సలహాదారు చెప్పాల్సిందేనని, ఏ అధికారికి పోస్టింగ్ ఇవ్వాలన్నా.. ఎవరికి పదవులు రావాలన్నా ఈయన అనుమతించాల్సిందే అన్నట్టుగా పరిస్థితులు మారాయని వాపోతున్నారు. ఇక ఈ సలహాదారు సొంత నియోజకవర్గం ఎస్టీ రిజర్వు కావడంతో అక్కడ ఉన్న ఎమ్మెల్యే పరిస్థితి మరీ ఘోరంగా తయారైనట్టు చెప్తున్నారు. అక్కడ ఏ నియామకమైనా ఈయనే చేపడుతున్నారని, నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాటకన్నా సలహాదారు మాటకే అధికారులు విలువ ఇస్తున్నారని తెలిసింది. ఇటీవల ఓ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని, మరో నామినేటెడ్ పోస్టును కూడా లోకల్ ఎమ్మెల్యేకు చెప్పకుండానే సలహాదారు తనవాళ్లకు ఇప్పించుకున్నారు. అంతేకాకుండా వరంగల్ జిల్లాలో కీలకమైన ఓ పోలీసు బాస్ పోస్టింగ్‌ను కూడా ఈ సలహాదారే వేయించారు. ఇటీవల కలెక్టర్ల బదిలీల్లోనూ ఈయన చెప్పినవారికే పోస్టింగ్‌లు వచ్చాయని అధికారులంతా చెప్పుకొంటున్నారు. రోజూ మంత్రుల ఇండ్ల ముందు ఉండే అధికారులు, ప్రజల క్యూకన్నా ఈ సలహాదారు ఇంటి వద్ద ఉండే క్యూనే అతి పెద్దగా ఉంటున్నదని చెప్తున్నారు. ఈయన హైదరాబాద్ చుట్టుపక్కల భూ సెటిల్మెంట్లను ఓ ఎమ్మెల్సీ, కొత్తగా కాంగ్రెస్‌లో చేరిన ఓ నేతతో కల్సి చేస్తున్నారని తెలిసింది.

**సైకిల్ నేతలకే ప్రాధాన్యం**

వరంగల్ ఉమ్మడి జిల్లాలో టీడీపీ నుంచి కాంగ్రెస్‌కు వచ్చిన కొంత మందినే ఈ సలహాదారు చేరదీస్తూ పాత కాంగ్రెస్ నేతలకు చెక్ పెట్టే ప్రయత్నాలు చేస్తున్నట్టు ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి. నాడు కాంగ్రెస్‌లో తనకు సీనియర్లుగా ఉన్న ఓ ఇద్దరు-ముగ్గురు ప్రజాప్రతినిధుల సూచనలకు అనుగుణంగా జిల్లాలో చక్రం తిప్పుతున్నట్టు తెలుస్తున్నది. జిల్లాలో ఓ కీలక పోలీసు అధికారి.. ఈ సలహాదారు ఆశీస్సులతోనే పోస్టింగ్ తెచ్చుకున్నాడు. ఆయన వచ్చిన నెలన్నర వరకు జిల్లాలోని కీలక మంత్రిని కనీసం మర్యాదపూర్వకంగా కూడా కలువలేదని, చూసీచూసీ చివరికి ఆ మంత్రే ప్రత్యేకంగా పిలిస్తే వెళ్లి కలిసి వచ్చినట్టు తెలిసింది. ఓరుగల్లులో నేతల మధ్య పెరుగుతున్న అంతరంలో ఓ వర్గానికి ఈయన అంతర్గతంగా సపోర్ట్ చేస్తున్నట్టు చెప్తున్నారు. ఒకరిద్దరు పాత కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు కూడా ఈ హయాంలో తమకు పనులు కావాలంటే 'సలహా'లు పాటించాల్సిందేనని, ఇక తప్పని పరిస్థితుల్లో సైకిల్ కాంగ్రెస్ వాళ్లతో కలిసి సాగాల్సి వస్తున్నదని వాపోతున్నారు. రాష్ట్రంలోని ముఖ్యనేత, ప్రధాన సలహాదారుతో ఉన్న అవినాభావ సంబంధం నేపథ్యంలో ఒకరిద్దరు అసలు కాంగ్రెస్ నేతలు సలహాదారు ఏమి చెప్పినా కాదనకుండా చేస్తున్నారు. కొండా మురళి వ్యాఖ్యలకు కూడా ఈయనే కారణమని కాంగ్రెస్ వర్గాలు కోడైకూస్తున్నాయి. మురళి వ్యాఖ్యల నేపథ్యంలో సైకిల్ కాంగ్రెస్ నేతలు ఏకమయ్యారని కాంగ్రెస్ నేతలు చెప్తున్నారు. ఇక ఈ సలహాదారు ఇప్పుడు ఎమ్మెల్సీ పదవిపై ఆశలు పెట్టుకున్నట్టు తెలుస్తున్నది.

# కాంగ్రెస్‌లో బోనం చిచ్చు!

- **భద్రకాళికి బోనం సమర్పించేందుకు సిద్ధమైన మంత్రి సురేఖ**
- **తీవ్రంగా వ్యతిరేకించిన సొంత పార్టీ ఎమ్మెల్యే నాయిని**
- **వేదపండితులు, స్థానికుల నుంచీ తీవ్ర అభ్యంతరాలు**
- **చివరకు బోనాలు తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు ప్రకటన**



వరంగల్, జూన్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఓరుగల్లులో జూన్ 22న (ఆదివారం)భద్రకాళి అమ్మవారికి తొలి బంగారు బోనం సమర్పిస్తామంటూ దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఇటీవల చేసిన ప్రకటన తీవ్ర వివాదాస్పదమైంది. సొంత పార్టీ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితోపాటు పలువురు వేద పండితులు, స్థానిక ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆగమశాస్త్రం ప్రకారం భద్రకాళికి బోనం ఉండదని, తరాలుగా వస్తున్న ఆచారాలు, సంప్రదాయాలను మార్చొద్దని, దీనిపై పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. బోనాలకు తాను వ్యతిరేకం కాదని, గ్రామదేవత వద్ద సమర్పిస్తే తామంతా అక్కడి వస్తామని స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు మంత్రి శుక్రవారం ప్రకటించారు.

**జంతుబలిని ఆపడం సాధ్యమా?**

మరోవైపు, భద్రకాళి అమ్మవారికి బోనం సమర్పించే అంశం ఆగమశాస్త్రానికి విరుద్ధమని పండితులు చెప్తున్నారు. అమ్మవారికి కల్యాణాలు, బ్రహోత్సవాలు జరిగే ఆలయాల్లో బోనాలు సమర్పించే సంప్రదాయం లేదని పండితులు స్పష్టంచేస్తున్నారు. బోనం సమర్పించిన తర్వాత జంతుబలి ఆనావాయితీగా వస్తున్నదని, భద్రకాళిలో బోనాలు మొదలుపెడితే జంతుబలిని ఆపడం సాధ్యమేనా? అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. మీడియాతో తన నివాసంలో చిట్‌చాట్ చేసిన మంత్రి సురేఖ.. భద్రకాళి ఆలయం కొందరి సొత్తు అన్నట్టుగా భావిస్తున్నారని, అభివృద్ధికి అడ్డుపడుతున్నారంటూ ఎమ్మెల్యే నాయినిని ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేయడంతో వివాదం మరింత హీటెక్కింది. ఇటీవల భద్రకాళి అమ్మవారి బోనాలకు సంబంధించి కొంతమంది నుంచి అభ్యంతరాలు వ్యక్తంకావడం, స్థానికంగా నెలకొన్న రాజకీయ విభేదాలతో అసాంఘిక శక్తులను ప్రేరేపించి గొడవలు సృష్టిస్తారన్న అనుమానంతో తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు తెలిపారు. బోనాలపై సంప్రదింపులు జరిపిన అనంతరం భవిష్యత్తు కార్యచరణ ప్రకటిస్తామని వెల్లడించారు.